సాక్షి
కామారెడ్డి

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



విజయం సాధించాలి
స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.

- 9లో ▸



ఘనంగా పడిపూజ
జిల్లాలోని పలు ప్రాంతాల్లోని అయ్యప్ప ఆలయాలలో ఆదివారం మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /15.1

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.


న్యూస్‌రీల్

21న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం సమావేశం
- నివేదికలతో సిద్ధమవుతున్న అధికారులు

సాక్షి, కామారెడ్డి: కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమవుతున్నారు. ఈనెల 21 న ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పెద్దల నుంచి కలెక్టర్లు, ఎస్పీలకు సమాచారం అందింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కార్యక్రమాలు, కొత్త ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి అధికారులతో సీఎం సమీక్షించనున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మలు జిల్లాకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

'పశువుల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలి'
కామారెడ్డి క్రైం: మారుతున్న సీజన్‌కు అనుగుణంగా పాడి పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా శీతాకాలంలో పశువులు మేతమేయడానికి అంతగా ఆసక్తి చూపవని, దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుందని పేర్కొన్నారు. అందుకే దాణా విషయంలో మార్పులు చేసుకుంటే మంచిదని వివరించారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య పాలు పితకాలని సూచించారు. చలికాలంలో దోమకాటు, ఇతర వైరస్‌ల వ్యాప్తి కారణంగా గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందుగానే టీకాలు వేయించాలని సూచించారు. చలినుంచి రక్షించేందుకు పశువుల షెడ్‌ల చుట్టూ గోనె సంచులు కట్టాలని, దాణాలో పోషక విలువలు, మాంసకృత్తులు, శక్తిని ఇచ్చే పదార్థాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

నేటి నుంచి యాసంగికి నీటి విడుదల
బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు యాసంగి సీజన్‌కు సోమవారం నుంచి నీటి విడుదల చేపడుతున్నట్లు ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి వారాబందీ ప్రకారం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుందన్నారు. మొదటి ఏడు రోజులు కాకతీయ కాలువ డీ-53 వరకు, తర్వాత 8 రోజులు డీ-53 తర్వాత ఉన్న ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం ఉన్న నీరు ఆయకట్టుకు సరిపోయేంత మాత్రమే ఉండటంతో ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు


నిజామాబాద్ నాగారం : బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. ఆదివారం నగరంలోని నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా వేసి సాదారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్ బన్సల్ మాట్లాడుతూ ఘర్‌వాపసీలో భాగంగా బీజేపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులున్నారు. బీజేపీలో చేరిన వారిలో మల్లేశ్‌యాదవ్, బైకాన్ సుధా మధు, ఆకుల హేమలత శ్రీనివాస్, సుంకరి నారాయణ బీజేపీలో చేరారు.

నాగంపేట్‌లో ఉద్రిక్తత
బాల్కొండ : ముప్కాల్ మండలం నాగంపేట్‌లో ఆదివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలో గురడి రెడ్డి సంఘ సభ్యులకు, సహకార సంఘ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ) సభ్యులకు మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం ఉంది. దీంతో ఆ భూమిపై ఇరువర్గాల వారు కోర్టుకెక్కారు. ఓ వర్గం కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందంటూ భూమిని దుక్కి దున్నారు. మరోవర్గం వారు ఆ నేలలో నీరు పెట్టారు. కానీ ఇరువర్గాల వారు ఆదివారం రాత్రి ఆ భూమి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, అధికారులు వివాదాస్పద భూమి వద్దకు రావాలని ఇరు వర్గాలవారు కోరగా వారు రాకపోవడంతో వారంతా అక్కడే కూర్చున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఉచ్చులో..!



- కామారెడ్డి పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ చదువుతున్న ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడ్డాడు. చదువు కోసం తల్లిదండ్రులు పంపిన డబ్బులను ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టి నష్టపోయాడు. దీని ఫలితంగా కుటుంబ సభ్యులూ తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది.
- పట్టణానికి చెందిన మరో యువకుడు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి భారీగా నష్టపోయాడు. చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు దాచుకున్న డబ్బులతో కొనుగోలు చేసిన ప్లాట్లను అమ్ముకోవాల్సి వచ్చింది.

- నులువుగా డబ్బు సంపాదించాలని బానిసలవుతున్న యువత
- అప్పులపాలవుతున్న వైనం
- జిల్లాలో ఎంతో మంది బాధితులు

సాక్షి, కామారెడ్డి: సులువుగా డబ్బు సంపాదించాలన్న అత్యాశ ఎన్నో జీవితాలను అతలాకుతలం చేస్తోంది. డబ్బుపై మోజుతో యువత ఆన్‌లైన్ బెట్టింగులు, గేమింగ్‌ల ఉచ్చులో పడుతున్నారు. ఫలితంగా తీవ్రంగ నష్టపోతున్నారు. కొందరు యువకులు అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ గేమింగుల్లో పాల్గొంటున్నారు. ఒక్కసారి ఆట రుచి తెలిస్తే చాలు దానికి అడిక్ట్ అవుతున్నారు. ఆటలో సంపాదించాలన్న ఒక్క కారణంతో అప్పులు చేస్తున్నారు. అప్పులు తీర్చే మార్గం లేనపుడు కుటుంబ సభ్యులతో గొడవలకు దిగుతున్నారు. ఆస్తి అమ్మి డబ్బులు ఇవ్వమని వేధిస్తున్నారు. కొన్ని సార్లు గొడవలు చిలికిచిలికి గాలివానగా మారి కుటుంబ సభ్యులపైనా దాడులకూ దిగుతున్నారు. చాలా కుటుంబాల్లో ఆన్‌లైన్ గేమింగ్ బాధితులు ఉన్నారు. కొందరు తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగినపుడు చాలా మంది ఆన్‌లైన్‌లో బెట్టింగులకు పాల్పడుతున్నారు. రూ.లక్షల్లో బెట్టింగులు కట్టి నష్టపోతున్నారు. బంతి బంతికి, పరుగు పరుగుకు ధర కట్టి బెట్టింగులకు దిగుతున్నా కలిసిరాక డబ్బులు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ పోలీసు కానిస్టేబుల్ ఆన్‌లైన్ గేమింగ్‌లో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలై కుటుంబ సభ్యులను కాల్చిచంపి, తను కూడా కాల్చుకున్న ఘటన నేపథ్యంలో కథనం..

ఆగం జేస్తున్న ఆన్‌లైన్ రమ్మీ

ఆన్‌లైన్‌లో రమ్మీ ఆట చాలా మందిని ఆగంజేస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో యువత ఆన్‌లైన్ రమ్మీ ఆటలో రూ.లక్షలు పోగొట్టుకున్నారు. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. ఫోన్ ద్వారా ఆన్‌లైన్ గేమ్‌లలో ఎంటర్ అవుతున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్టుగా వాటికి అలవాటవతున్నారు. ఒకసారి డబ్బులు వస్తే చాలు రెచ్చిపోతున్నారు. రూ.వేల నుంచి రూ.లక్షల దాకా ఆడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్ అనేది పెద్ద మోసం అన్న విషయం తెలిసే సరికి ఉన్నది నష్టపోయి అప్పులతో రోడ్డున పడుతున్నారు. తెలిసిన వారి దగ్గర చేసిన అప్పులు తీర్చడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నిఘా అవసరం

అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి కోసం కన్నా చెడు కోసం ఎక్కువగా వాడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్‌లు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్‌లపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. దారి తప్పుతున్న యువతకు సంబంధించిన సమాచారం తెలిసినపుడు వారి ద్వారా మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బయటకు చెప్పుకోలేక..
తమ కొడుకు చదువుకొని ప్రయోజకుడు అవుతాడని తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో అడిగినన్ని డబ్బులు ఇస్తున్నారు. వారి ఆశలను చిదిమేసే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. కొడుకు చేస్తున్న తప్పుడు పని గురించి తెలిసిన తరువాత కన్నవారు తల్లడిల్లిపోతున్నారు. తమ పిల్లలు చేసిన అప్పులు చూసి షాకవుతున్నారు. చదువుల కోసమో, ఇళ్ల నిర్మాణానికో, పెళ్లిళ్లకో అప్పులు చేయడానికే భయపడే తల్లిదండ్రులు.. ఆన్‌లైన్ గేమ్‌లతో రూ.లక్షలు అప్పులు చేసిన కొడుకులను చూసి కుమిలిపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు బయటకు తెలిస్తే పరువు పోతుందన్న ఉద్దేశంతో అప్పులు కట్టేస్తున్నారు. మరికొందరు పిల్లలు చేసిన అప్పులు తీర్చడానికి ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు అప్పు తీర్చలేమని ఆవేదనకు గురవుతున్నారు.

గృహలక్ష్మికి గుడ్‌బై

ఇందిరమ్మ ఇళ్లకే మొగ్గు..
- సొంతజాగా ఉంటే సాయం పెంచేందుకు ప్రభుత్వం ఆలోచన
- మార్గదర్శకాలు జారీ చేస్తేనే స్పష్టత వచ్చే అవకాశం

మోర్తాడ్ : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. గత ప్రభుత్వం అమలు చేసిన గృహలక్ష్మి పథకానికి గుడ్‌బై చెప్పింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికే మొగ్గు చూపింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నుంచి డబుల్ ఇళ్ల నిర్మాణానికే ప్రాధాన్యత ఇచ్చింది. పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలకే డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించడాన్ని పరిమితం చేశారు. ఈ ఇళ్ల నిర్మాణం కూడా నత్తనడకన సాగడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పలేదు. చివరకు సొంతంగా జాగా ఉండి ఇంటిని నిర్మించుకునేవారికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షల చొప్పున సాయం అందించే కార్యక్రమం చేపట్టారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందే గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేశారు. సరైన దిశానిర్దేశం లేకపోవడంతో ఈ పథకం కింద ఎవరికీ సాయం అందలేదు. సాయం మంజూరుకి సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను జారీ చేసినా వాటిపై అధికారుల సంతకాలు లేకపోవడంతో ఎన్నికల స్టంటే అని కొట్టిపారేశారు. ఒక్కో నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఎక్కడా గృహలక్ష్మి పథకం కింద ఎవరూ లబ్ధి పొందిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒక్కటి. ఓసీ, బీసీలకు ఇంటిని నిర్మించుకుంటే రూ. 5 లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించారు. మార్గదర్శకాలు జారీ అయితేనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

'పేదలందరికీ సంక్షేమ ఫలాలందాలి'



అయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తున్న అశ్విన్ శ్రీవాస్తవ

డిచ్‌పల్లి: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అట్టడుగు వర్గాల వారికి అందేలా కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి అశ్విన్ శ్రీవాస్తవ సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం మెంట్రాజ్‌పల్లి, కంజర గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అశ్విన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్, డీపీవో జయసుధ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలి బెల్లాల్, ఎంపీడీవో టీవీఎస్ గోపి, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాకీ టోర్నీ

- సెమీస్‌కు చేరిన ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు



హాకీ ఆడుతున్న జట్లు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శనివారం ప్రారంభమైన హాకీ 67వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల, బాలికల టోర్నీ కొనసాగుతోంది. ఉమ్మడి పది జిల్లాల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల, బాలికల జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఆదివారం సాయంత్రం క్యాంప్ ఫైర్ నిర్వహించారు. సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు. బాలుర విభాగంలో తొలి సెమీఫైనల్‌లో నిజామాబాద్‌తో రంగారెడ్డి, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్‌తో మహబూబ్‌నగర్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు. బాలికల విభాగంలో మొదటి సెమీఫైనల్‌లో నిజామాబాద్‌తో మహబూబ్‌నగర్, రెండో సెమీఫైనల్‌తో రంగారెడ్డితో హైదరాబాద్ జట్లు పోటీపడతాయని తెలిపారు.



క్యాంప్ ఫైర్ నిర్వహిస్తున్న దృశ్యం

తప్పుడు ప్రచారంతో తిప్పలు

- గ్యాస్ కనెక్షన్ ఈ-కేవైసీపై సోషల్ మీడియాలో ప్రచారం
- ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్న వినియోగదారులు
- ఉజ్వల కనెక్షన్‌లకు మాత్రమే నెలాఖరువరకు గడువు..
- మిగతా వినియోగదారులు ఎప్పుడైనా చేసుకోవచ్చంటున్న అధికారులు



ఈ-కేవైసీ కోసం దోమకొండ భారత్‌గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

దోమకొండ: ఒక తప్పుడు ప్రచారం గ్యాస్ వినియోగదారులను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తుంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఈ-కేవైసీ చేయించుకోవాలని సమాచారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో అమాయక ప్రజలు పనులు మానేసి గంటల తరబడి గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరి అవస్థలు పడుతున్నారు. నిజానికి మహాలక్ష్మి పథకానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదు. కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పొందిన వినియోగదారులు ఈనెల 31 వరకు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉండగా..ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయడంలో ఏజెన్సీలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించడంతో వంటగ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులను తెచ్చి పెట్టింది.

సోషల్ మీడియాలో ప్రచారంతో..

కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్‌లు ఇస్తుంది. వీరికి సిలిండర్ మిగతా వారికంటే తక్కువ ధరకు వస్తుంది. వీటిని ఏజెన్సీలే జారీచేయడంతో ఆ కనెక్షన్‌లు అర్హులకే అందాయా లేదా అనే తెలుసుకునే క్రమంలో ఈ-కేవైసీ డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. సదరు కనెక్షన్‌లు పొందిన వినియోగదారులు స్వయంగా వచ్చి తమ ఆధార్ సంఖ్యతో ఈకేవైసీ అనుసంధానం చేయాల్సి ఉంది. రెండు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. మరో వైపు ఆయా కంపెనీలు సైతం పనిలో పనిగా సాధారణ కనెక్షన్ ఉన్న వినియోగదారులు కేవైసీ చేయించుకోవాలని సూచించాయి. నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ చేయించుకొకపోతే కనెక్షన్ రద్దవుతాయని తద్వారా రాయితీలు వర్తించవని తప్పుడు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇదే సందర్భంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడం.. ఆరు గ్యారంటీల్లో ఒకటైన రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న ప్రకటన వినియోగదారులను అయోమయానికి గురిచేస్తుంది. ఫలితంగా వారం రోజులుగా ఏజెన్సీల ముందు వృద్ధులు, మహిళలు చంటిపిల్లలతో బారులు తీరుతున్నారు.

రెండు రోజుల పాటు తిరిగాను


గ్యాస్ కనెక్షన్ ఈ - కేవైసీ కోసం రెండు రోజుల పాటు తిరిగాను. పనులు వదిలేసి గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిల్చున్నాక సర్వర్ రావడం లేదని తెలిపారు. తిరిగి మళ్లీ తెల్లవారి వచ్చి ఉదయం నుంచి అక్కడే ఉన్నాం. డెలివరీ బాయ్‌లతో ఈ - కేవైసీ చేయిస్తే బాగుండేది.

– పోశయ్య, జంగంపల్లి, భిక్కనూరు మండలం

తుది గడువు తెలియజేయాలి


వంట గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీ చేయించు కోవాలని చెప్పారు. రెండు రోజుల పా టు తిరిగినా మంది పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీంతో మధ్యాహ్నం వెళ్లి అక్కడే లైన్‌లో ఉండి ఈ-కేవైసీ చేయించుకున్నాం. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుది గడువు గురించి ఏజె న్సీ వారు ప్రజలకు తెలియజేస్తే బాగుంటుంది.

– సామల నర్సింలు, దోమకొండ

రూ.500కు సిలిండర్‌తో ఈ-కేవైసీకి సంబంధం లేదు
రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌కు సంబంధించి మార్గదర్శకాలు జారీ కాలేదు. ప్రస్తుతం జరుగుతున్న ఈ- కేవైసీ ప్రక్రియకు గ్యారంటీ పథకానికి ఎలాంటి సంబంధం లేదు. ఈనెల 31లోగా ఉజ్వల కనెక్షన్‌దారులు మాత్రమే కేవైసీ చేయించుకోవాలి. ఇతర కనెక్షన్‌దారులకు గడువు అంటూ ఏమీలేదు. ఏజెన్సీల వద్దే కాకుండా డెలివరీ బాయ్స్ కూడా ఇంటివద్ద ఈ - కేవైసీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. – మల్లికార్జున్, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి, కామారెడ్డి

కేజీబీవీలో వసతులు కరువు

- ఒకే గదిలో చదువు, నిద్ర
- కోతులు, పందులతో ఇబ్బందులు
- అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



చదువు, విశ్రాంతి ఇదే గదిలో..

నిజాంసాగర్: అనాథ, చదువు మధ్యలో మానేసిన బాలికలను అక్కున చేర్చుకొని ఉన్నత విద్యను అందిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమస్యలకు నిలయంగా మారింది. నిజాంసాగర్‌లోని కేజీబీవీలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేక పందులు, కోతులు బడి ఆవరణలో స్వైర విహారం చేస్తున్నాయి. మురికి నీటి పైపులైన్లు, కాల్వలు లేక దుర్గంధం వెదజల్లుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేక చదువు, నిద్ర ఒకే గదిలో సాగిస్తున్నారు.

పందులు, కోతుల స్వైరవిహారం

గుట్టకు ఆనుకొని ఉన్న నిజాంసాగర్ కేజీబీవీ వెనుక బాగాన ప్రహరీ లేకపోవడంతో అడవి, ఊర పందులు, కోతుల బెడద అధికంగా ఉంది. పందులు వంటశాల గదుల్లోకి వచ్చి తిరుగుతున్నాయి. తరగతి గదులతో పాటు డార్మెట్ రూముల్లోకి కోతులు గుంపులుగా వస్తుండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. భోజన సమయంలో దాడి చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. నెలకు ఐదారుగురు విద్యార్థులు కోతుల దాడిలో గాయపడుతున్నారు.


నిధులు చాలడం లేదని..

కేజీబీవీని కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం గతంలో రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. విద్యాలయం ఆవరణలో తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గదుల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదనపు గదులకు కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని కాంట్రాక్టర్ నిర్మాణంతో సరిపెట్టారు. ఆ గదుల్లో వసతులు కల్పన, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టలేదు. అంతేగాకుండా తరగతుల నిర్వహణకు కావాల్సిన ఫర్నీచర్ లేదు. దీంతో ఆ గదులు నిరుపయోగంగా మారాయి.



నిజాంసాగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

వేధిస్తోన్న గదుల కొరత
నిజాంసాగర్ సమీపంలో ఉన్న కేజీబీవీలో ఆరు నుంచి పదో తరగతి వరకు 227 మంది, ఇంటర్‌లో 106 మంది బాలికలు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేక తరగతి గదులనే డార్మెట్ రూమ్‌లుగా ఉపయోగిస్తున్నారు. చదువుకున్న తరగతి గదిలోనే రాత్రి వేళ విద్యార్థినులు నిద్రస్తున్నారు. విద్యాలయంలో ఎనిమిది తరగతి గదులు, ఆరు డార్మెట్ రూమ్‌లు ఉన్నాయి. దీంతో 6, 7, 8 తగతుల బాలికలు తరగతి గదులను డార్మెట్ రూములుగా ఉపయోగిస్తున్నారు. తరగతి గదిలోనే పుస్తకాల బస్తాలు, బ్యాగులు, పడక బట్టలను పెట్టుకుంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లా


పాఠశాల ఆవరణలో తరగతి గదుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గదులు నిర్మించినా సరైన సదుపాయల్లేవు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాను. అలాగే పాఠశాల వెనుక ప్రహరీ లేకపోవడంతో పందులు, కోతుల వస్తున్నాయి. మురికి కాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది.

– సరోజన, కేజీబీవీ ప్రిన్సిపాల్, నిజాంసాగర్

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. శని,ఆదివారాల్లో అండర్–14, 16 బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలు చేపట్టారు. పోటీలకు ఏలేటి ముత్యం రెడ్డి అబ్జర్వర్‌గా పర్యవేక్షించారు.ఫిబ్రవరిలో గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రత్నాకర్, కార్యదర్శి రాజాగౌడ్, కైసర్, కపిల్, నరేశ్ మహేశ్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు..



సిరికొండ: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిరికొండ కేజీబీవీ విద్యార్థిని సంధ్యారాణి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫర్వీన్ బేగం పీఈటీ స్వప్న తెలిపారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ మీట్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. అండర్–14 విభాగంలో లాంగ్ జంప్‌లో సంధ్యారాణి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. 600 మీటర్ల పరుగు పందెంలో అంజలి వెండి పతకం, షాట్ పుట్‌లో అంజలి శ్రీలతలు వెండి పథకాలు సాధించారు. అండర్ 16 విభాగంలో షాట్ పుట్‌లో పూజ హారికలు వెండి పతకాలను సాధించారు. గుజరాత్‌లో వచ్చే నెలలో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సంధ్యారాణి పాల్గొంటుందని వారు తెలిపారు.

వివక్షతో పదవి నుంచి తొలగించే కుట్ర

ఆర్మూర్‌టౌన్: దళితుడైన తనను అగ్రవర్ణాల నాయకులు పదవి నుంచి తొలగించే కుట్ర చేస్తున్నారని మాక్లూర్ ఎంపీపీ మాస్త ప్రభాకర్ ఆరోపించారు. అగ్రవర్ణాల కుట్రకు నిరసనగా ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ దళిత ప్రజాప్రతినిధులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నిరసన తెలిపారు. మాక్లూర్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ధనబలంతో తనకు మద్దతుగా ఉన్న ఎంపీటీసీలను కొనుగోలు చేసి అవిశ్వాస తీర్మాణం పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలాగే మాక్లూర్ ఎంపీటీసీ–2 మీరాబాయిని కిడ్నాప్ చేశానని కేసులు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీంతో పాటు ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి చేస్తున్న కుట్రను దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నాగార్జునరెడ్డి



భీమ్‌గల్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నాగార్జున రెడ్డిని ఆదివారం నియమించారు. జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీ నారాయణ నియామకపత్రాన్ని అందజేశారు. అధికార ప్రతినిధిగా నియమించిన బస్వ లక్ష్మీ నారాయణ, ఎంపీ అర్వింద్, జిల్లా మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటీ మల్లికార్జున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నెమ్మదించిన పెట్టుబడి సాయం

- ఎకరంలోపు భూమి ఉన్న రైతులకే అందిన వైనం
- నిధుల కొరతే కావచ్చంటున్న అధికార వర్గాలు



మోర్తాడ్: రైతులకు అందాల్సిన పంట పెట్టుబడి సాయం నెమ్మదిస్తోంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం అందించడానికి రాష్ట్ర ఖజానాలో నిధుల కొరత తీవ్రంగా ఉందనే సందేహం వ్యక్తమవుతుంది. పెట్టుబడి సాయాన్ని రిలీజ్ చేస్తూ ప్రభుత్వం ప్రకటించి ఐదు రోజులైనా ఇప్పటి వరకు ఎకరంలోపు భూమి ఉన్న రైతులకే సాయం వారి ఖాతాల్లో జమైంది.విడతల వారిగా రోజుకో ఎకరం విస్తీర్ణం పెంచుతూ పక్షం రోజుల్లో మెజార్టీ రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాల్సి ఉంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. ఎకరం భూమికి ఒక్కో సీజన్‌లో రూ.7,500 చొప్పున సాయం అందిస్తామని ప్రకటించింది. రైతు భరోసా విధి విధానాలను ఇంకా ఖరారు చేయకపోవడంతో ఈ సీజన్‌లో పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.5వేల చొప్పున సాయం అందించడానికి ప్రభుత్వం సమాయత్తమైంది. ఈనెల 13 నుంచి జమ చేస్తున్నామని వెల్లడించగా ఇప్పటి వరకు ఐదు ఎకరాల భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం జమ కావడంలో వేగం పెరుగలేదు. గత సీజనులో జిల్లాలో 2,78,351 మంది రైతులకు రూ.274 కోట్ల సాయం జమ చేశారు. పెట్టుబడి సాయాన్ని ఐదు ఎకరాలకు కుదించడం, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, బడా వ్యాపారులు, ఆర్థికంగా వృద్ధి చెందినవారికి ఇవ్వకూడదనే డిమాండ్ ముందు నుంచి వినిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదేమి పరిగణలోకి తీసుకోకుండా భూమి ఉండి పట్టాపాసు పుస్తకం పొందిన ప్రతి ఒక్కరికి సాయం నిధులు జమ చేశారు. వందల ఎకరాల భూమి ఉన్న రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు పెట్టుబడి సాయం జమ చేశారు. ఈ విధానంతో రాష్ట్ర ఖజానా దివాళ తీసే పరిస్థితి ఏర్పడిందని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుభరోసా కింద అందించే సాయం విషయంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగుతుందని ప్రకటించా రు. యాసంగి సీజన్ సమయం మొదలు కావడంతో ఇప్పుడు విధి విధానాలు రూపొందించి సాయం జమ చేయాలంటే ఎక్కువ సమయం పట్టే అవకా శం ఉంది. పాత పద్ధతిలో జమ చేసి వర్షాకాలం సీజ న్ వరకు కొత్త మార్గదర్శకాలతో పెట్టుబడి సాయం జమ చేసే అవకాశం సైతం ఉంది. పాత పద్ధతిలోనై నా మెజార్టీ రైతులకు సాయం జమ కావాల్సి ఉన్నా ఖజానాలో నిధుల కొరత కారణంగా పెట్టుబడి సాయం జమ చేయడంలో జాప్యం జరుగుతుందనే అభిప్రాయం అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి అసలైన రైతులకు పెట్టుబడి సాయాన్ని వేగంగా జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

స్త్రీ లేకపోతే ప్రపంచమే లేదు

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లబ్ధిదారులు

బాన్సువాడ: స్త్రీలేకపోతే ప్రపంచమే లేదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన 118మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం పంపిణీ చేసి మాట్లాడారు. గత సెప్టెంబర్ వరకు నియోజకవర్గంలో 15వేల మంది లబ్ధిదారులకు రూ.130కోట్ల సాయాన్ని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా అందించినట్లు తెలిపారు. రూ.20కోట్లతో బాన్సువాడలో మాతాశిశు ఆస్పత్రిని నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

నిజాంసాగర్: మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం 31 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకే చోట చేరడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాం.. చదువుల చెట్టు నీడలో అనే పాటకు పూర్వ విద్యార్థులు డ్యాన్స్ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవతి, పూర్వ విద్యార్థులు వినయ్‌శంకర్, అనిల్‌కుమార్, నాగవేందర్, రేణుక, ప్రవీణ్, ఇమ్మాన్యుయల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో, డీఎస్పీని సన్మానిస్తున్న స్నేహితులు

డిచ్‌పల్లి: బర్ధీపూర్ శివారులోని హోటల్ కృష్ణలో ఆదివారం నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1994–1997 విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు హోటల్ కృష్ణలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. కొందరు ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మరి కొందరు ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారు. ఈ బ్యాచ్‌కు చెందిన వారిలో ఎంఏ మాలిక్ అసోసియేట్ ప్రొఫెసర్,ఎం.గంగాధర్ డీఎస్పీ (హైదరాబాద్), వినోద్‌కుమార్ (ఆర్మూర్ ఆర్డీవో), రాజేశ్వర్ (అసిస్టెంట్ రిజిస్ట్రార్) ఉన్నారు. రావుట్ల నర్సయ్య సిరికొండలో సత్యశోధక్ పాఠశాల నిర్వహిస్తున్నారు. మరో 20 మంది వరకు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, మరికొందరు పలుశాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. సమ్మేళనంలో డీఎస్పీ గంగాధర్, ఆర్డీవో వినోద్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యశోధక్ నర్సయ్య, ఎంఏ మాలిక్, సత్యనారాయణ, ఇబ్రహీం, గంగాధర్, చిరంజీవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో..



భక్తులకు సందేశం ఇస్తున్న మహరాజ్

నిజామాబాద్ రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి కృష్ణ మహరాజ్ అన్నారు. రూరల్ మండలంలోని మల్లారం శివారులో ఉన్న లింగేశ్వర గుట్ట ఆశ్రమ 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 321 జంటలు శివునికి ప్రత్యేక అభిషేకం, బిల్వ పత్రాలతో పూజలు, కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమానికి హాజరైన మధుసూదనానంద సరస్వతి స్వామి భక్తులకు సందేశం ఇచ్చారు. ప్రజలు స్వార్థాన్ని వీడి తల్లిదండ్రులు, గురువులను ఆదరించినప్పుడే భగవంతుడు అనుగ్రహిస్తాడని బాలయోగి కృష్ణ మహరాజ్ అన్నారు. భజన మండలి భక్తులు ఆలపించిన కీర్తనలతో ఆశ్రమం ఆధ్యాత్మికత శోభను సంతరించుకుంది. అనంతరం మహరాజ్ ప్రవచనాలు చేశారు. భక్తులు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కుంకుమార్చన, బిల్వార్చన చేస్తున్న భక్తులు

అనుమతులు రాక సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు



రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డి శివారులోని కట్టిడిపో ప్రాంతంలో కిలోమీటర్ వరకు సింగిల్ రోడ్డుతో ఈ రోడ్డు వెంట ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో కిలోమీటర్ మేర డబుల్ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని ప్రజాప్రతినిధులు చెప్తున్నారు. రామారెడ్డి సబ్ స్టేషన్ నుంచి రూ.13 కోట్ల వ్యయంతో 7 ఏళ్ల క్రితం రామారెడ్డి వయా మద్దికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మధ్యలో కట్టిడిపో దగ్గర అటవీ ఉండటంతో అనుమతులు రాక సింగిల్ రోడ్డుగానే ఉండిపోయింది. ఈ సింగిల్ రోడ్డు ప్రాంతంలో రోడ్డుకిరువైపులా చెట్లు విస్తరించడం, మూల మలుపులతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అటవీ శాఖ నుంచి అనుమతులు తీ సుకొని సింగిల్‌గా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా వి స్తరించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు బజార్ లేక అవస్థలు

- కూరగాయల క్రయవిక్రయాలకు అనువైన స్థలం కరువు
- ఆర్టీసీ ఖాళీ ప్రాంతం కేటాయించాలని రైతుల వేడుకోలు



ఎండలో కూరగాయలు అమ్ముతున్న రైతులు

ఇందల్వాయి: కూరగాయల క్రయవిక్రయాలకు అనువైన స్థలం లేక మండల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకరంగా రోడ్ల వెంట ఉంటూ విక్రయాలు చేపడుతున్నారు.కూరగాయలు విక్రయించే వారిలో మహిళలు అధికంగా ఉండడంతో మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాన్ని..

మండలంలోని ఆర్టీసీ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు అధికారులు ఇటీవల ప్రహరీ నిర్మించారు. ఆర్టీసీ ప్రాంతంలో ఖాళీ స్థలం ఉంది. అందులో రైతుల కోసం తాగునీరు, మూత్రశాలలతో కూడిన రైతు బజార్‌ను నిర్మిస్తే కూరగాయల క్రయవిక్రయాలకు ఎంతో అణువుగా ఉంటుంది. మండల కేంద్రానికి నిత్యం సుమారు 60 మంది రైతులు కూరగాయలు విక్రయించడానికి వస్తుంటారు. వీరి నుంచి క్రయవిక్రయాల కోసం రోజుకు రూ.30 వసూలు చేస్తే ఆర్టీసీకి ఎంతో ఆదాయం సమకూరుతుంది. డిచ్‌పల్లి వారాంతపు సంతలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకున్నా ఒక్కో రైతు నుంచి అధికంగానే వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ మిగులు ప్రాంతంలో రైతు బజార్‌ను నిర్మించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

గతంలో విన్నవించినా..

మార్కెట్ సమస్యలపై గతంలో ఆర్టీసీకి విన్నవించినా యాజమాన్యం పట్టించుకోలేదు. ఆర్టీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మించి లీజుకు ఇచ్చారు. అది కేవలం కొంత మంది లబ్ధికే ఉపయోగపడిందన్న విమర్శలు వచ్చాయి. అసలు పెట్రోల్ బంక్ ఎప్పుడు తెరిచి ఉంటుందో ఎప్పుడు మూసి ఉంటుందో ఎవరికీ తెయదు. అధికారులు స్పందించి మిగులు స్థలాన్ని రైతుల కోసం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"రైతుల సమస్యని పరిష్కరించాలి



రైతులకు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు సరైన స్థలం లేదు. ఆర్టీసీ వారు తమ స్థలంలో రైతు బజార్‌ను నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో రైతుల రుసుము ద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంది.

–అంబర్‌సింగ్ నాయక్, రైతు, మేఘ్యానాయక్ తండా

మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు



మండల కేంద్రంతో పాటు వారంతపు సంతల్లో సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్టీసీ మిగులు ప్రాంతాన్ని రైతుల కోసం కేటాయిస్తే బాగుంటుంది.

–నోముల శ్రీనివాస్ రెడ్డి, రైతు, నల్లవెల్లి

నామమాత్రంగా ఎస్ఎంసీలు



భట్టు తండాలో నేలపై కూర్చున్న విద్యార్థులు



రామారెడ్డి బాలుర పాఠశాల

- పర్యవేక్షణ లేమితో ఇబ్బందుల్లో విద్యార్థులు
- ఈ నెలాఖరున ముగియనున్న ఎస్ఎంసీల గడువు

రామారెడ్డి: ప్రభుత్వ బడుల అభివృద్ధికి సలహాలు స్వీకరించి వాటిని ఆచరణలో పెట్టేందుకు ఏర్పాటైన యాజమాన్య కమిటీలు(ఎస్ఎంసీ) మొక్కుబడిగా మారాయి. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులను కమిటీలో భాగస్వామ్యం చేశారు. అనేక చోట్ల ప్రభుత్వ బడుల వైపు కమిటీ సభ్యులు చూడకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్ఎంసీలు విద్యాభివృద్ధితో పాటు మౌలిక వస్తువుల కల్పనకు కమిటీలు కృషి చేయాల్సి ఉండగా వాస్తవ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఈ నెల చివరి వరకు ప్రభుత్వ స్కూల్ ఎస్ఎంసీల గడువు ముగియనుంది. కమిటీలు ఏర్పాటు తర్వాత అంతగా ప్రభావం చూపలేదని విద్య నిపుణులు పేర్కొంటున్నారు.

భాగస్వామ్యం నామమాత్రమే..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ బడుల్లో యాజమాన్య కమిటీల ఏర్పాటు తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు తల్లిదండ్రులు, సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకున్నారు. సర్పంచ్, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్, బడుల యాజమాన్య కమిటీ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉండగా చాలా చోట్ల ఇది అమలు కావడం లేదు.

బడుల్లో అనేక సమస్యలు..

సర్కార్ బడులు సమస్యల నిలయంగా మారాయి. అనేక పాఠశాలలో కనీసం మరుగుదొడ్ల లేని పరిస్థితి నెలకొంది. కొన్ని బడుల్లో వంటగదిలు లేక తరగతి గదుల్లోనే వంట చేస్తున్నారు. ప్రహరీ లేక రక్షణ కొరవడింది. శుద్ధి చేసిన నీరు అందుబాటులో లేక విద్యార్థులు ఇంటి నుంచి నీటిని తీసుకువస్తున్నారు. క్రీడా మైదానలు, తరగతి గదుల సమస్య తీవ్రంగా వేధిస్తున్నాయి. కమిటీల పనితీరు మెరుగుపడితేనే విద్యార్థులు నాణ్యమైన విద్య అందించే అవకాశం ఉంది. ప్రభుత్వం మనఊరు–మనబడిని పథకం ద్వారా బడులకు పురోగతికి సంకల్పించిన పనులు పూర్తి చేయలేక చేతులెత్తేయడంతో జిల్లాలోని చాలా పాఠశాలల్లో తరగతి గదుల కొరత వేధిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటే చదువులు కొనసాగిస్తున్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు బిల్లులు రాకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు చేతులెత్తేశారు.

పట్టించుకుంటేనే బోధన వసతులు..

సర్కారు బడుల్లో ఏర్పాటైన విద్యా కమిటీలు విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తేనే నాణ్యమైన విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అందించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా విద్యా కమిటీలు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలోని బడుల్లో సమస్యల వివరాలు

మరుగుదొడ్లు లేనివి	523
తాగునీరు	150
భవనాల మరమ్మతులు	2034
విద్యుత్ సమస్యలు	86
కావాల్సిన బల్లలు	67,622
బ్లాక్ బోర్డులు	5,615
ప్రహరీలు	575
వంట గదులు	204
శిథిల భవనాలు	708

క్రైం కార్నర్


చెరువులో పడి యువకుడి మృతి

నవీపేట: మండలంలోని తుంగిని శివారులో ఉన్న చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. మండలంలోని మాన్‌సింగ్ తండాకు చెందిన రాథోడ్ మోహన్(40) తుంగిని శివారులో శ్రీనివాస్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో పాలేరుగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం శివారులోని చెరువులో కాలకృత్యాలకు వెళ్లిన మోహన్ ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య రాథోడ్ లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మరొకరు..

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన అర్జున్(52) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొర్లికొండకు చెందిన అర్జున్ చెరువులో చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం వెళ్లగా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి ..



వర్ని: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ ఆదివారం తెలిపారు. బస్టాండ్‌లో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతుడు వయస్సు 35 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

బోదేపల్లిలో వాహనాల తనిఖీ

బాల్కొండ: బోదేపల్లి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేసినట్లు ఏఎస్సై శంకర్ ఆదివారం తెలిపారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఏఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

గాంధారి: మండల పరిధిలోని లొంక తండాలో ఉన్న వాగుపై నుంచి ఆదివారం డీసీఎం వ్యాన్ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గం వైపు నుంచి గాంధారికి మక్కల లోడుతో వస్తున్న డీసీఎం లొంకతండా – గుజ్జుల్ తండాల మధ్యలో ఉన్న వాగుపై నుంచి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

రాష్ట్రస్థాయి పోటీలకు అబ్జర్వర్‌గా గంగామోహన్



డిచ్‌పల్లి: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 16 నుంచి 18వరకు నిర్వహించే 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీలకు రాష్ట్ర పరిశీలకుడి (అబ్జర్వర్)గా మండలంలోని మిట్టాపల్లి వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీత్‌రావు ఆదివారం తెలిపారు. అనంతరం గంగామోహన్‌ను సంగీత్‌రావుతో పాటు టి.విద్యాసాగర్ రెడ్డి, బి.మల్లేశ్ గౌడ్, వి.ప్రభాకర్ రెడ్డి, హెచ్ఎం సుశీల్ కుమార్ అభినందించారు.

నలుగురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ నరహరి

ఖలీల్‌వాడి: చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి తెలిపారు. నగరంలోని రెండో టౌన్ పీఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. శివాజీనగర్‌కు చెందిన గోపు గంగమ్మ ఇంట్లో జిల్లా కేంద్రానికి చెందిన ఇంద్రాల కళ్యాణ్, మర్రెపల్లి రాకేశ్, తాడెం శోభ, ముక్క జమున ఈ నెల 15న దొంగతనానికి పాల్పడ్డారు. బాధితురాలి మెడలో ఉన్న 2.2 తులాల బంగారు చైన్, రూ. 10 వేల నగదును చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశారు. కేసు ఛేదించిన సిబ్బందిని అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.